
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 20 జనవరి 2025





ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఓ బ్రాండ్ ఇమేజ్ ఉంది. సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పించడంతో పాటు బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తారు. కూటమి ప్రభుత్వంలో కూడా చంద్రబాబు తనదైన శైలిలో స్పందించి... దరఖాస్తు ఇచ్చిన 24 గంటలు గడవక ముందే బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. పేదరికం లేని సమాజం.. ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త కావడం చంద్రబాబు విజన్. అందుకు తగ్గట్లుగానే ఆయన ముందుకు వెళుతున్నారు.

వీరప్రసాద్‌కు వెల్డింగ్ పనిముట్లు, సుబ్బరాయుడుకు పెన్షన్ అనుమతి పత్రం అందిస్తున్న కలెక్టర్





దటీజ్ చంద్రబాబు

- ఇచ్చిన హామీలు 24 గంటల్లోనే అమలు
- బాధితుల హర్షం

(కడప/మైదుకూరు రూరల్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైదుకూరులో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో పా ల్గొనేందుకు సీఎం చంద్రబాబు వచ్చారు. గ్రీన్‌వాక్‌లో భాగంగా మైదుకూరు మున్సిపాలిటీలోని వినాయక్‌నగర్‌లో గ్రీన్‌వాక్ చేశారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడంతో పాటు పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలంటూ ప్రజల్లో అవగాహన కల్పించ డమే సీఎం ప్రధాన ఉద్దేశ్యం. ఇందులో భాగంగా వినాయకనగర్‌లో గ్రీన్‌వాక్ చేస్తూ ఇంటింటికీ వెళ్లి మహిళలను చైతన్యం చేసే కార్యక్రమం చేపట్టారు చంద్రబాబునాయుడు వినాయక్‌నగర్‌లో ఉన్న వేల్పూర్ల విష్ణువందన ఇంటిని సందర్శించారు. సీఎం చంద్రబాబు ఆశయాలకనుగుణంగా విష్ణువందన కుటుంబం ఇంట్లోనే తడిచెత్త పొడిచెత్తను వేరు చేసి దాని ద్వారా సంపద సృష్టించాలన్న చంద్రబాబు ఆశయాలకనుగుణంగా ఇంట్లోనే కిచెన్ గార్డెన్, పూలమొక్కలు పెంచుతున్నారు. ఆ పరిసరాలు చూసి చంద్రబాబునాయుడు ముగ్ధులయ్యారు. ఎందరో మహిళలకు విష్ణువందన ఆదర్శంగా నిలిచిందని అభినందించారు. వారి కుటుంబ జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. మీరెంత మంది, ఏం చ దువుతున్నారు, ఉద్యోగాలు, ఆర్థిక పరిస్థితి ఏంటి అంటూ అడిగారు. ఇంతలోనే అక్కడే ఉంటున్న మిగతా కుటుంబ సభ్యులు కూడా అక్కడికి వచ్చారు. ఆర్థికసాయం కోసం వారందరూ చంద్రబాబుకు వి నతిపత్రాలు అందించారు. వీరి కుటుంబాల జీవన విధానం, ఆర్థికపరిస్థితి తెలుసుకుని వారి జీవన విధానం మార్చేందుకు గాను మిమ్మల్ని ఆదుకుంటాను, మీ జీవనవిధానం మారుస్తాం, మీ ఆదాయం మారుస్తామని, మీకున్న అర్హతలను బట్టి ప్రభుత్వపరంగా ఏం చేయాలో ఆ సాయం చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు వెంటనే కలెక్టరు చెరుకూరి శ్రీధ ర్‌కు వీరి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

24గంటలు గడవక ముందే..

సీఎంకు అర్జీలు ఇచ్చిన 24గంటలు గడవక ముందే సీఎం ఆదేశాల మేరకు కలెక్టరు డాక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టరు అతిథిసింగ్ ఆదివారం మైదుకూరుకు వెళ్లి వందన కుటుంబ సభ్యులు



నిన్న మైదుకూరులో వీరప్రసాద్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

ఇచ్చిన ఆరు వినతిపత్రాలలో రెండింటిని వెంటనే తీరుస్తూ ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఆ కుటుంబంలో వృద్ధాప్య పించను కోసం దరఖాస్తు చేసిన వి.సుబ్బరాయుడుకు పించను మంజూరు చేస్తూ డీఆర్‌డీఏ ద్వారా పత్రం ఇచ్చారు. ఇక రెండు కాళ్లు పనిచేయని లక్ష్మీదేవికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇక ఉపాధి కోసం తాను కుటుంబాన్ని పోషించేందుకు వెల్డింగు మిషన్‌కు సాయం చేయాలని వీరప్రసాద్ విన్నవించగా.. అందుకు అవసరమైన కొటేషన్‌ను తీసుకున్నారు. ఇక గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వందనకు నైపుణ్యత పరిశీలించి డీఆర్‌డీఏ ద్వారా ఔట్‌సోర్సింగ్ లేదా డేటా ఎంట్రీ ఆపరేటరుగా ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఇక కుటంబాన్ని పోషించేందుకు ఆర్థిక సాయం అందించాలని వి.నాగేంద్రబాబు ఇచ్చిన దరఖాస్తుకు బీసీ కార్పొరేషను ద్వారా ఆటో కొనుగోలుకు ఆర్థికసాయం అందించాలని కలెక్టరుకు ఆదేశించారు. మరో నిరుద్యోగి నీరజ్ తాను బీటెక్ చదివానని ఉద్యోగం ఇప్పించాలని కోరగా అర్హత ప్రమాణాలు బట్టి జాబ్‌మేళాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కలెక్టరు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, సురేశ్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ తదితరులు పాల్గొన్నారు.

రాఘవరెడ్డిపై విచారణ

- డీఈవో, ఆర్జేడీగా పనిచేసేటపుడు పలు ఆరోపణలు
- 18 అభియోగాలతో చార్జ్ నోటీసు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప డీఈవో, ఆర్జేడీగా పనిచేసిన వై.రాఘవ రెడ్డిపై విచారణకు ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఏపీ బాలభవన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాఘవరెడ్డి గతంలో కడప డీఈవోగా, ఆర్జేడీగా పనిచేస్తున్న సమయంలో ఆయనపై వచ్చిన 18 ఫిర్యాదులపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. పది రోజుల్లోగా సంజాయిషీ చెప్పుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ ఫిర్యాదులపై పాఠశాల విద్యా శాఖ కమిషనరు అందజేసిన నివేదిక మేరకు రాఘవరెడ్డిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం పూనుకుంది. ఆయన డీఈవోగా, ఆర్జేడీగా పనిచేసే కాలంలో కడప, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వేధించడం, తన పరిధికి మించి అక్రమ బదిలీలు చేపట్టడం, నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల డిప్యుటేషన్‌లు, సస్పెన్షన్‌లు, అసభ్యంగా దూషించడం, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను దుర్భాషలాడటం వంటి పలు అంశాలపై రాఘవరెడ్డిని ప్రభుత్వం సంజాయిషీ కోరింది. ప్రధానంగా కడప, అన్నమయ్య జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులను ఫోన్‌లో బెదిరించడంతో పాటు ఎస్‌సీఈఆర్టీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగితో అసభ్యంగా మాట్లాడటం వంటి పలు అంశాలను అభియోగాల్లో చేర్చారు. అంతకుముందు ఇవే అంశాలపై తొండూరు మండలంలో పనిచేసే ఒక ఉపాధ్యాయుడు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఈ అంశాలన్నింటిపై విచారణ చేయించాలని కోరుతూ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఆర్.నరసింహారావు, ఎం.ఆర్.ప్రసన్నకుమార్‌లు ఫిర్యాదుల్లోని అంశాలన్నింటిలోనూ ప్రాథమిక ఆధారాలున్నాయని నివేదించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలించిన ప్రభుత్వం చివరకు తగు చర్యల కోసం విచారణ చేయించాలని నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీసీ కుల గణన చేపట్టాలి

- జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి
- బీసీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌రావు



బీసీ సంక్షేమ సంఘం ఆవిర్భావ సభలో ఐక్యత చాటుతున్న బీసీ సంఘాల నాయకులు

జమ్మలమడుగు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరిగే కుల గణనలో బీసీ కుల గణనను ప్రత్యేకంగా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు తెలిపారు. ఆదివారం జమ్మలమడుగులోని చౌడేశ్వరీదేవి కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయిలో బీసీ సంక్షేమ సంఘం ఆవిర్భావ సమావేశం జరిగింది. సమావేశానికి నియోజకవర్గంలోని నలుమూలల నుంచి ఇతర ప్రాంతాలకు చెందిన బీసీ సంక్షేమ సంఘం 22 సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. అందులో జాతీయ నాయకులు మాట్లాడుతూ బీసీ లెక్కలు తీసి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ కులాల లెక్కలు కేంద్రం చేపట్టేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బాధ్యతలు తీసుకోవాలన్నారు. బీసీ కుల గణనపై అమిత్‌షాతో చంద్రబాబు, పవన్‌లు చర్చించాలన్నారు. రాయితీలతో రాజీపడకుండా బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడాలన్నారు. జెండా మోసే పదవులే కాదు బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలన్నారు. కులాలుగా ఐక్యమై రాజకీయంగా బీసీలు సంఘటితం కావాలన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పర్యటనలో ఉన్నందున ఈ సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా జరిగే జాతి జన గణనలో బీసీ కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలని ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని, కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆ హామీని నిలబెట్టుకోవాలంటే జాతీయస్థాయిలో బీసీ కుల గణన జరిగితేనే ఇది సాధ్యమవుతుందని వారు తెలిపారు. బీసీల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు మొదటి నుంచి అన్యాయం చేస్తున్నారని, ఈ అన్యాయాన్ని సరిదిద్దాలంటే బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని, నామినేటెడ్ పోస్టులలో, పాలన పదవుల్లో బీసీలకు 50 శాతం వాటా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కడప జిల్లాకు వైఎస్ఆర్ జిల్లా, కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెట్టిన విధంగానే బీసీల ఆకాంక్షలను గౌరవించి రాష్ట్రంలోని ఏదైనా నూతన జిల్లాకు, ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేయబోయే విమానాశ్రయానికి కానీ సర్దార్ గౌతులచ్చన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కడప జిల్లా నుంచి బీసీలకు రాజకీయంగా అవకాశాలు రావడం లేదని, ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒకటి మాత్రమే బీసీలకు అవకాశం ఇచ్చారని మిగతా అయిదు ఎమ్మెల్యేలు అగ్రకులాలకు చెందినవారే ఉండడం శోచనీయమన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు 16 మంది శాసనసభ్యులైతే ఒక్కసారి మాత్రమే బీసీలకు అవకాశం వచ్చిందని, మిగతా 15 సార్లు రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే రాజకీయంగా హస్తగతం చేసుకున్నారని వారు తెలిపారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఏకమై రాయితీలతో రాజీపడకుండా రాజకీయ అధికారమే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, జిల్లా ఐక్యవేదిక అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, బడిగించల చంద్రమౌళి, కార్యనిర్వాహక అధ్యక్షులు కాటా రామదాసు, బీసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

సీఎం పర్యటన విజయవంతం

- పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మైదుకూరులో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ 29వ వర్థంతి కార్యక్రమాలకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం అయినట్లు మైదు కూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. ఇందుకు సహకరించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఆర్‌డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, ఎన్‌టీఆర్ అభిమానులకు, మీడియా మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుదాకర్ యాదవ్

వైసీపీలో ఉద్యోగుల హక్కులు భగ్నం

- ఆర్థిక ఉపశమనం కలిగించేలా భరోసా కల్పించాలి
- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

కడప మారుతీనగర్, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను భగ్నం చేస్తూ భయాందోళనలకు గురిచేయడమే లక్ష్యంగా సాగిందని ప్రభు త్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ విమర్శించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ హాలులో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులను ఆర్థిక పర ఇబ్బందులకు గురిచేయడమే ధ్యేయంగా వైసీపీ పాలన సాగడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగుల ఆర్థికపర హక్కుగా సంక్రమించిన పలు ప్రయోజనాల చెల్లింపుల్లోనూ జగన్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందన్నారు. ఉద్యోగుల జీపీఎఫ్ విషయంలో రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడిందని.. చివరకు ఉద్యోగుల సొమ్మును కూడా ఇతర అవసరాలకు వాడుకున్న సంగతి తెలిసిందే అన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు వారి తాలూ కు జీతాల్లో 10 శాతం కోత విధించి, వారికి అదనంగా కలిపి ఖాతాల్లో జమ చేయాల్సిన డబ్బును కూడా ఇవ్వకుండా తీవ్ర మానసిక క్షోభకు గురిచేసిందన్నారు. పలు దఫాలుగా ఉద్యోగుల సమస్యలను వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. చివరకు ఉద్యోగులకు, ప్రభుత్వ పెన్షనర్లకు ఒకటో తేదీన చెల్లించాల్సిన వేతనాలు, పెన్షన్‌లు సైతం కాలయాపన చేసి ఇటు ప్రభుత్వ ఉద్యోగులను, అటు పెన్షన్‌దారులను తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారన్నారు. పేరుకుపోయిన ఉద్యోగుల బాకీలే దాదాపు రూ.25వేల కోట్ల పైచిలుకుందన్నారు. దీన్ని దృష్టిలో వుంచుకుని ఉద్యోగులకు కూడా కొంత సంయమనం పాటించాల్సి వుందన్నారు. త్వరలోనే ఉద్యోగులకు రావాల్సిన బాకీలన్నీ విడతల వారీ తీరుస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వాలన్నారు. న్యాయబద్ధమైన వేతన సవరణ బాకీలు తీర్చేలా విశ్రాంత హైకోర్టు న్యాయ మూర్తి నేతృత్వంలో తక్షణమే వేతన సవరణ కమిషన్ నియమించి ఉద్యోగులకు ఆర్థిక ఉపశమనం కల్పించేలా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శి కృష్ణప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రఘురామనాయుడు, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, ట్రెజరర్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు మురళి, నగర అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి నితీష్ కార్యవర్గ సభ్యులు, సభ్యరాల్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఆర్ సూర్యనారాయణ

వెలిగల్లు నుంచి ఆరు మండలాలకు తాగునీరు

- రూ.270 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు
- త్వరలో సీఎం చంద్రబాబు రాయచోటిలో పర్యటన
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, వెలిగల్లు జలాశయం నుంచి ఆరు మండలాలకు తాగునీరు అం దించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మండలంలోని గుండ్లచెరువు పంచాయతీ పసుపులవాండ్లపల్లెలో పర్యటించారు. మంచినీరు, భూసమస్యల గురించి పలువురు టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వెలిగల్లు జలాశయం నుంచి గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి రూరల్ మండలాల్లోని 700పైబడి పల్లెలకు రూ.240 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, అలాగే రూ.270 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు కూడా ప్రతిపాదనలు పంపామని మంత్రి తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయచోటి నియోజకవర్గంలో పర్యటించనున్నారని, అప్పుడు ఆ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి దగ్గర ఆమోదం పొందేటట్లు చేయడానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రజలు అనేక భూసమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువగా భూసమస్యలు ఉన్నాయని, వీటిని పరిశీలించడానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు భద్రప్పనాయుడు, మహమ్మద్‌రియాజ్, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి.. పక్కాగా భూముల రీసర్వే

- పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన 35 గ్రామాల్లో రీసర్వే
- 20-25 రోజుల్లో సర్వే పూర్తి చేసేలా కార్యాచరణ
- వాట్సాప్ గ్రూపులో రైతుల అభ్యంతరాల స్వీకరణ
- ఇప్పటికే రైతులకు అవగాహన, నోటీసులు జారీ

కడప కలెక్టరేట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారులో 2020లో ప్రారంభమైన జగనన్న భూరక్ష అంటూ చేపట్టిన రీసర్వే తప్పుల తడకగా సాగింది. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూమి కంటే తక్కువగా చూపారంటూ రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. భూముల యజమానులు రాకుండానే ఆగమేఘాల మీద ఇష్టారాజ్యంగా రీసర్వే చేశారు. తప్పుల తడకగా రెవెన్యూ రికార్డుల్లో చేర్చడం, పాస్ బుక్‌లపై జగన్ బొమ్మ ముద్రించడం, చివరికి రైతుల భూముల్లో సరిహద్దురాళ్లు కూడా జగన్ బొమ్మతో ఉండడం లాంటి చర్యలతో రైతులు విసిగిపోయారు. దీంతో కూటమి సర్కారుకు రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో గతంలో జిల్లాలో జరిగిన 285 గ్రామాల్లో 4.44 లక్షల ఎకరాల రీసర్వే తప్పులను చక్కదిద్దేందుకు రెవెన్యూ, సర్వేశాఖ అధికారులు నానా తంటాలు పడుతున్నారు. జగనన్న భూరక్ష కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయక తప్పలేదు. ఇలాంటి పరిస్థితి భవిష్యత్తులో రాకుండా రైతులు సంతృప్తి చెందేలా భూముల రీసర్వే పక్కా ప్రణాళికతో చేసేందుకు చంద్రబాబు సర్కారులో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలో గత నెల రోజులుగా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ నేతృత్వంలో జిల్లా సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మురళీ కృష్ణ ఈనెల 20వ తేదీ నుంచి తప్పులు లేకుండా పక్కా ప్రణాళికతో రీసర్వే జరిగేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఏపీ రీసర్వే పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో 35 మండలాల్లో 35 గ్రామాల్లో రీసర్వే పనుల కోసం రైతులకు అవగాహన కల్పించేలా ర్యాలీలు, టాంటాం గ్రామసభలు నిర్వహించారు. రైతులు నేరుగా సర్వే సమయంలో అందుబాటులో ఉండే లా నోటీసులు కూడా అందజేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో బ్లాకులుగా విభజించి రీసర్వేకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇది జిల్లా రైతులకు శుభ పరిణామమే.

ఒక్కో గ్రామానికి 20-25 రోజుల్లో రీసర్వే

జిల్లాలో 735 రెవెన్యూ గ్రామాల్లో 22.36 లక్షల ఎకరాల భూవిస్తీర్ణం ఉంది. ఈ భూములకు సంబంధించి ఎఫ్ఎంబీలు (ఫీల్డ్ మ్యాపులు) 3.64 లక్షలు ఉన్నాయి. జగనన్న భూరక్ష పేరుతో నాలుగేళ్ల పాటు తప్పుల తడకగా 285 గ్రామాల్లో 4.44 లక్షల ఎకరాల భూములకు రీసర్వే జరిగింది. ఇప్పుడు రీసర్వేలో తప్పులు జరగకుండా ఉండేలా ఎంపిక చేసిన గ్రామాల్లో నాలుగు బ్లాకులుగా విభజించారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములను గుర్తించారు. ఒక్కో గ్రామంలో రీసర్వేకు సంబంధించి బృందాలను ఏర్పాటు చేశారు. అందులో ఇద్దరు మండల, గ్రామ సచివాలయ సర్వేయర్లు, ఒక వీఆర్వో, వీఆర్ఏలు ఉంటారు. పర్యవేక్షణ చేసేందుకు తహసీల్దార్లు, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్లు అందుబాటులో ఉంటారు. 20-26 రోజుల్లో చేసే రీసర్వేలో తప్పులు దొర్లకుండా రైతులు సంతృప్తి చెందేలా సక్సెస్‌గా ప్రక్రియ సాగనుంది. ముఖ్యంగా సర్వే డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు. మిగతా మండలాల్లో భూముల రీసర్వే పనులు జరిగేలా ప్రభుత్వం తదుపరి కార్యాచరణ ప్రారంభించనుంది. అంతే కాకుండా ఈ సర్వేలో భాగస్వాములుగా ఉన్న రైతులను, సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేయనున్నారు. కొలతల్లో అభ్యంతరాలు ఉంటే నేరుగా రైతులు అధికారులకు చెప్పవచ్చు.

రైతు సంతృప్తి చెందేంత వరకు రీసర్వే

రైతులు తమ భూముల రీసర్వే సమయంలో అసంతృప్తి చెందకూడదు. శాటిలైట్ విధానంలో రోవర్స్, డ్రోన్ సర్వేలను ప్రామాణికంగా తీసుకుంటారు. భూముల సరిహద్దుల సమస్యలు రాకుండా పూర్తి స్థాయిలో ఆర్ఎస్ఆర్, అడంగల్, ఎఫ్ఎంబీ లాంటి పూర్తి స్థాయి రికార్డులతో అధికారులు సర్వేలో పాల్గొంటారు. ఆధునిక పద్ధతిలో సాగే రీసర్వేతో సంతృప్తి చెందకపోతే పాత గొలుసు (లింకుల్లో) పద్ధతిలో కూడా సర్వే చేసేలా చంద్రబాబు సర్కారు సర్వేశాఖను అప్రమత్తం చేసింది. దీంతో ఇప్పటికే ప్రభుత్వ భూములైన డీకేటీలు, అసైన్డ్, దేవదాయ, వక్ఫ్ భూములతో పాటు గ్రామ కంఠాలను, వంకలు, వాగులను జిల్లా సర్వే, రెవెన్యూశాఖ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో పైలట్ ప్రాజెక్టు కింద రైతుల సమక్షంలో జరిగే ఈ రీసర్వే విమర్శలకు తావు లేకుండా రైతుల సంతృప్తి చెందేలా ఉండాలంటే రైతులు తప్పక ఫీల్డ్‌పై వచ్చి సర్వే చేయించుకోవాలని అధికారులు కోరుతుండడం గమనార్హం.

రైతులు రీసర్వేలో పాల్గొనాలి



ఏపీ పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టే సర్వేలో రైతులు భాగస్వాములు కావాలి. ఇప్పటికే నోటీసులు అందుకున్న రైతులు రీసర్వేలో తప్పులు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించుకోవాలి. భూముల రీ సర్వే సక్రమంగా లేదని భావిస్తే అవసరమైతే పాత పద్ధతిలో గొలుసు(లింకులు)తో కొలిపించుకోవాలి. రీసర్వే యంత్రాంగం అంతా భూములకు సంబంధించిన రికార్డులతో రీసర్వే చేస్తారు. అప్పటికీ సందహాలు తీరకుంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో అభ్యంతరాలు తెలిపితే మళ్లీ ఫిజికల్‌గా పరిశీలించి సర్వే చేయడం జరుగుతుంది. రైతు సంతృప్తి చెందేంత వరకు సర్వే జరగాలంటే రైతులు తప్పక పాల్గొనాలి.

- కావాడి మురళీ కృష్ణ, సర్వేశాఖ ఏడీ

కడప ఉక్కు ఊసేదీ..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తులసిరెడ్డి ఆగ్రహం

కడప కలెక్టరేట్/మారుతీనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు సంగతి సరే.. కడప ఉక్కు సంగతేమిటని మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలపై మండిపడ్డారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ చట్టంలోని 13వ షెడ్యూల్ ప్రకారం విభజన జరిగిన 6 నెలల లోపు సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు కర్మాగారాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఉందన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించేందుకు కావాలసిన అన్ని హంగులూ ఉన్నాయన్నారు. జిల్లాలో నీకెదిన్నె, జమ్మలమడుగు, మైలవరం తదితర అనేక మండలాల్లో కావాలసినంత భూమి ఉందన్నారు.నీటి వనరులకు సంబంధించి గండికోట, మైలవరం, బ్రహ్మంసాగర్, సోమశిల జలాశయాలు ఉన్నాయన్నారు. విద్యుత్‌కు ఆర్‌టీపీపీ, రవాణా సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఇన్ని వనరులు ఉన్నా ఉక్కు పరిశ్రమ స్థాపించకుండా బీజేపీ, వైసీపీ, టీడీపీలు నిరుద్యోగుల జీవితాలతో చలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలతో పాటు విభజన చట్టంలోని అంశాలు అమలు జరిగేలా కడప ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య సత్తార్, ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

జమ్మలమడుగు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నాగులకట్ట వీధి చౌడేశ్వరీదేవాలయం వద్ద శనివారం రాత్రి పంగులూరి లక్ష్మీప్రసన్న (34) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. స్థానికులు, అర్బన్ పోలీసులు అందించిన వివరాల్లోకెళితే... జమ్మలమడుగులో చౌడేశ్వరీ దేవాలయం పూజారి వెంకట హరికిరణ్‌శర్మకు రాయచోటి వాసి లక్ష్మీప్రసన్నతో సుమారు 16 ఏళ్ల కిందట వివాహమైంది. ఈ క్రమంలో వీరు చౌడేశ్వరీ దేవాలయం పక్కనే నివాసం ఉంటున్నారు. కాగా శనివారం ఉదయం యాగంటిలో బంధువుల ఇంటికి వెళ్లిన లక్ష్మీప్రసన్న రాత్రి 12 గంటలకు తిరిగి ఇంటికి చేరింది. అప్పటికే ఆమె భర్త ఇంటి వద్ద లేకపోవడంతో ఆమె ఇంట్లోకి వెళ్లింది. ఇంటికి వచ్చిన భర్త భార్యను పిలిస్తే పలక్కపోయే సరికి తలుపు తొలగించారు. అప్పటికే ఇంట్లో పడిపోయి ఉన్న లక్ష్మీప్రసన్న మెడచుట్టూ గాయాలై ఉన్నాయి ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందిందని డాక్టర్లు వివరించారు. ఆమె మెడచుట్టూ ఎర్రగా శరీరం కంది, దెబ్బ తగిలి వాపు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆస్పత్రి మార్చురీలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమె మృతికి గల కారణాలపై విచారిస్తున్నట్లు అర్బన్ పోలీసు స్టేషన్ రైటర్ సుబ్బారెడ్డి, తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.



మహిళ మృతదేహం - ఇన్‌సెట్‌లో మెడచుట్టూ కంది ఉన్నట్టు గుర్తు



చౌటిపల్లె వద్ద ఢీకొన్న రెండు లారీలు(ఫైల్ ఫొటో)

18 రోజులు... 10 ప్రమాదాలు

- ముగ్గురు మృతి - గాయాలపాలైన ఆరుగురు
- నాలుగు లేన్ల రహదారిపై తరచూ ప్రమాదాలు
- ఆందోళనలో ప్రయాణికులు

కొండాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం మొదలుకొని 19వ తేదీ వరకు జాతీయ రహదారిపై సుమారు పది వేర్వేరు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో ముగ్గురు దుర్మరణం చెందగా సుమారు పది మంది వరకు గాయాలపాలయ్యారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాద నివారణ వారోత్సవాలు నిర్వహిస్తుండగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవడం చూస్తుంటే ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రమాదాలు జరుతున్న విధానం, తీవ్రత పరిశీలిస్తే ప్రస్తుతం జరుగుతున్న హైవే పనులు, రహదారిపై అడ్డంగా ఉన్న మట్టి కుప్పల వలన ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అంటే ఇందులో హైవే అథారిటీ అధికారుల తప్పిదం ఒక ఎత్తయితే ప్రయాణీకులు జాగ్రత్తలు పాటించకపోవడం మరో తప్పిదమని అర్థమవుతోంది. వివరాల్లోకెళితే.... ముద్దనూరు-తాడిపత్రి నాలుగులేన్ల రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు 51 కిలోమీటర్లు(నేషనల్ హైవే-67) నాలుగు లేన్ల పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ రహదారి పనులు తుదిదశకు చేరుకున్నాయి. డిసెంబరు 31న గండ్లూరు వద్ద బైకు ఢీకొనడంతో శివనారాయణరెడ్డి మృతిచెందాడు. వెంకటాపురం వద్ద మట్టి కుప్ప ఉండడంతో మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇందులో ఇద్దరు గాయపడ్డారు. రెండురోజుల కిందట చౌటిపల్లె వద్ద రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో గాయపడి చికిత్స పొందతున్న లారీడ్రైవర్ జయకుమార్ ఆదివారం మృతిచెందాడు. తాజాగా చాకలి వృత్తితో జీవించే సుబ్బరాయుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడంతో మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది. ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు, ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు పని జరిగే చోట ముఖ్యంగా క్రాసింగ్‌లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని వాహనచోదకులు వాపోతున్నారు. రోడ్డు పనిచేసేటప్పుడు తగిన ఏర్పాట్లు చేయకుండా, మట్టికుప్పలు పోయడంతో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాలు అరికట్టేలా పోలీసులు, నేషనల్‌హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం వద్ద ముద్దనూరు-తాడిపత్రి నేషనల్ హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకలి సుబ్బరాయుడు(55) మృతిచెందాడు. చౌటిపల్లె వాసి సుబ్బరాయుడు చాకలి వృత్తి చేస్తుంటాడు. రోజు పనిలో భాగంగా ఆదివారం మోపెడ్‌లో తాడిపత్రి వైపు వెళుతుండగా వెంకటాపురం వద్ద అదే వైపు వెళుతున్న కారు వెనుక నుంచి మోపెడ్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో సుబ్బరాయుడుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



సుబ్బరాయుడు మృతదేహం - (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

ఆయుర్వేద ఆస్పత్రులకు నిధులు విడుదల చేయాలి

కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ఆయుర్వేద డాక్టర్ల యూనియన్



సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు

చాపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు ఆయుర్వేద ఆస్పత్రులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ఆయుర్వేద డాక్టర్ల యూనియన్ అధ్యక్షుడు బండారు నాగేశ్వరరావు కోరారు. ఆదిత్య ఆయుర్వేద గ్రామ్ ఆస్పత్రిలో రాయలసీమ జోన్ డాక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఆయుర్వేద ఆస్పత్రులు ప్రారంభించుకునేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. నకిలీ ఆయుర్వేద సెంటర్లు లేకుండా చేయాలన్నారు. రామా ఆయుష్ వెబ్‌సైట్‌ను కొత్తగా ప్రారంభించారు. దక్షిణ భారతదేశ రాష్ట్రాల ఆయుర్వేద డాక్టర్ల యూనియన్ ఇన్‌చార్జిగా డాక్టర్ వీరబోయిన నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ గౌరవాధ్యక్షుడిగా మాధవరెడ్డిని సభ్యులు ఎన్నుకున్నట్లు డాక్టర్ రవికుమార్ తెలిపారు. రాయలసీమ జిల్లాల నుంచి ఈ సమావేశానికి డాక్టర్లు హాజరయ్యారు.

మద్యం మత్తులో బస్సు డ్రైవరు

ప్రయాణికుల ఫిర్యాదుతో కేసు నమోదు

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్య మత్తులో బస్సు నడుపుతున్న డ్రైవరుపై ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ హేమసుందర్ రావు అందించిన వివరాల మేరకు తిరుపతి నుంచి హైదరాబాద్ వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మద్యం మత్తులో అతివేగంగా బస్సు నడుపుతూ ప్రయాణికులతో గొడవపడ్డాడు. మద్యం మత్తులో బస్సు నడపవద్దని ప్రయాణికులు వాదిస్తూ బస్సును కోడూరు వద్ద నిలిపారు. దీంతో డ్రైవరు అక్కడి నుంచి వెంటనే పరారయ్యాడు. ప్రయాణికులు యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ, ఎస్‌ఐ నవీన్‌బాబు ప్రైవేట్ ట్రావెల్స్ యాజయాన్యంతో సంప్రదించి ప్రయాణికులను మరో బస్సులో తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

చిత్తశుద్ధితో పనిచేయాలి

- అమరావతి సహా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలి
- సీపీఎం రాష్ట్ర మహాసభలో బాబూరావు

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరలోని సీపీఎం కార్యాలయంలో 27వ రాష్ట్ర మహాసభలో 'కడప జిల్లా సమగ్రాభివృద్ధి - ప్రజాప్రణాళిక' అంశంపై నిర్వహించబఽ జిల్లా సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయకుండా కొత్త ప్రాజెక్టు నిర్మిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పడం ప్రజలను మోసగించడమే అన్నారు. ఉక్కు పరిశ్రమ ఆందోళనలో భాగస్వామి అయిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇది రాష్ట్ర సమస్య కాదని దేశ సమస్యగా భావిస్తున్నామని స్పష్టంగా చెప్పారన్నారు. జీఎస్టీ వల్ల చిన్న వ్యాపారులు చితికిపోయారని చెప్పారు. కొత్త పరిశ్రమలు రావడం లేదని, నెలకు రూ.2లక్షల కోట్లు ఏడాదికి రూ.25లక్షల కోట్లు జీఎస్టీ ద్వారా కేంద్రానికి వెళ్తోందన్నారు. దీనిని టీడీపీ, వైసీపీ బలపరుస్తూ ఉన్నాయని తెలిపారు. రైతు వ్యతిరేక చట్టాలు రద్దు ఎర్రజెండా వల్లే సాధ్యమైందన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు ఉక్కు పరిశ్రమ గురించి మాట్లాడకుండా వెళ్లిపోవడం ఆయనకే చెల్లిందన్నారు. విద్యుత్ బిల్లుల మోత నాలుగు రకాలుగా ప్రజలపై వేస్తున్నారని చెప్పారు. ఇళ్లకు ఆదాని స్మార్ట్ మీటర్లు వస్తున్నాయని, వీటిని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, శివకుమార్, అన్వేష్, దస్తగిరిరెడ్డి, విద్యార్థి యువజన సంఘాల నేతలు, మహిళా సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత బాబురావు

వ్యక్తి ఆత్మహత్య

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పగడాలపల్లె వాసి షేక్ మౌలా(38) మద్యం మత్తులో ఉరివేసుకున్నట్లు ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు. మృతుడు మద్యం తాగుతూ తాను చనిపోతానని తరచూ కుటుంబ సభ్యులతో చెప్పేవాడన్నారు. భార్య పుట్టింటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నట్లు తల్లి మస్తాన్ బీ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య ఫరీదా ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మస్కట్‌లో కడపవాసి మృతి

కడప క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప నగర వాసి మస్కట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. బిస్మిల్లానగర్‌కు చెందిన షేక్ మహ్మద్ అన్సారి (35) ఉపాధి నిమిత్తం రెండేళ్ల కిందట మస్కట్‌కు వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న సమయంలో ఆదివారం గుండెపోటుతో మరణించాడు. ప్రస్తుతం అన్సారీ కుటుంబం కడప ఎ1నగర్‌లో ఉన్న ట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని కడపకు తెప్పించేందుకు ఎస్ఎం ద్వారా మంత్రి లోకేశ్‌కు విన్నవించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై మంత్రి లోకేశ్ స్పందించినట్లు సమాచారం.



సబ్‌జూనియర్ హాకీ టోర్నీ విజేత కడప

మదనపల్లె టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్ విజేతగా జిల్లా జట్టు నిలిచింది. మదనపల్లెలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్‌జీ గిరిరావు 14వ అంతర్ జిల్లా సబ్‌జూనియర్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. కడప, అనకాపల్లె జట్ల మధ్య నిర్వహించిన ఫైనల్స్‌లో ఇరుజట్ల ఆటగాళ్లు నిర్దేశించిన సమయంలో 1-1 చొప్పున గోల్స్ సాధించగా తరువాత నిర్వహించిన షూటవుట్‌లో అనకాపల్లె జట్టు ఒక గోల్ సాధించగా, కడప జిల్లా జట్టు 2 గోల్స్ సాధించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ఆదిత్య కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి ట్రోఫీ అందించగా, రన్నరప్ జట్టుకు విద్యాసాగర్ ట్రోఫీ అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన తిరుపతి జట్టుకు హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణుక్యరాజ్ ట్రోఫీ అందజేశారు. అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి ప్రసాదరెడ్డి, హితేష్ పర్యవేక్షించారు.





హాకీ టోర్నీ విజేతగా నిలిచిన కడప జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు - అనకాపల్లె జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందిస్తున్న అతిథులు

ఎస్సీ వర్గీకరణ త్వరగా చేపట్టాలి

పులివెందుల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ త్వరగా చేపట్టాలని పులివెందుల నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సమన్వయకర్త కొమ్ము నాగేశ్వరరావు, ఎంఈఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, పులివెందుల నాయకులు సాకె చరణ్‌కుమార్ కోరారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు విలేకరులతో మాట్లాడారు.

వసతులు త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్సీ



కాంబల్లిలో హౌసింగ్ కాలనీని పరిశీలిస్తున్న రామగోపాల్‌రెడ్డి, అధికారులు


సింహాద్రిపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాంబ ల్లి గ్రామంలో నిర్మించిన ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం కాంబల్లిలో హౌసింగ్ పీడీ రాజరత్నంతో కలిసి ఇండ్లను పరిశీలించిన ఆయన మా ట్లాడుతూ 2016-17లో ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ పేరుతో 42 ఇండ్లను మంజూరు చేసిందన్నారు. అప్పట్లో ఇంటి నిర్మాణాలు చాలా వరకు పూర్తి కావడం, సీసీ రోడ్లు కూడా వేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈ కాలనీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో నేటికీ లబ్ధిదారులు వినియోగించేకునే అవకాశం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో డ్రైనేజ్, తాగునీటి పనులను పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రమణారెడ్డి, ఏఈ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాంతర మాధ్యమాన్ని ఏర్పాటు చేయాలి : ఏపీటీఎఫ్ అమరావతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో సమాంతర తెలుగు మాధ్యమాన్ని అమలుపరచాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ విద్యాశాఖను కోరారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాషలో ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం పాఠశాలల్లో తెలుగు మాధ్యమం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హైస్కూల్ విద్యలో తెలుగు మాధ్యమం అత్యంత అవసరమన్నారు. ఏకపక్షంగా ఇంగ్లీష్ మాధ్యమాన్ని మాత్రమే ప్రవేశపెట్టడం అన్యాయమన్నారు. కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఉమాకాంత్ మాట్లాడుతూ హైస్కూల్ వ్యవస్థలో మెర్జింగ్‌ను ఎత్తివేసి ప్రాథమిక పాఠశాలలో మెర్జింగ్ విధానాన్ని కొనసాగించడంతో పల్లె పాఠశాలల్లో కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు సాయి, పద్మజ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్



విజయవంతంగా ముగిసిన వారాహి క్రికెట్ టోర్నీ



విజేతలకు బహుమతులు అంజేస్తున్న నిర్వాహకులు

పెనగలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పెనగలూరు ఉన్నత పాఠశాల మైదానంలో జనసేన మండల అధ్యక్షుడు ఎర్రంశెట్టి హరిబాబు రాయల్, ప్రధాన కార్యదర్శి గుబ్బూరు హరికృష్ణ రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వారాహి క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్, కొత్త సింగనమల ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. విజేతలకు హరిబాబు రాయల్ ట్రోఫీ, విన్నర్ జట్లకు నగదు బహుమతులను అందజేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి హరికృష్ణ రాయల్ రన్నర్ జట్లకు మెమెంటోతో పాటు నగదు బహుమతులను అందజేశారు. రాజంపేట మండల వెంకట రాజంపేట వాసి గోపి లెవెల్స్ జట్టు విన్నర్స్‌కు రూ.50 వేలు, కంబాలకుంట సుధాకర్ లెవెన్స్ రన్నర్ జట్టుకు రూ.20 వేల నగదు బహుమతులు అందజేశారు. వారాహి వాలీబాల్ విన్నర్స్ కంబాలకుంట బుజ్జి జట్టుకు ప్రధాన బహుమతిగా రూ.15 వేలు ఓబిలి అరుణ్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.7000 నగదును అందజేశారు. కొత్త సింగనమలలో జరిగిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన అంబేడ్కర్ లెవెన్ జట్టుకు హరిబాబు రాయల్ ట్రోఫీ, రూ.40 వేలు నగదు బహుమతి అందజేశారు. సత్తుపల్లి శివాజీ లెవెన్స్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు అందజేశారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'



మాట్లాడుతున్న రాష్ట్రఅధ్యక్షుడు మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఉద్యోగ ఉపాధ్యాయులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర చరిత్రలో లేని విధంగా 2022 నుంచి సరెండర్ లీవ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి స్పందించి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను మంజూరు చేయాలని అదేవిధంగా 30శాతం ఐఆర్‌ను వెంటనే మంజూరు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చింతగింజల సుదర్శన్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేంద్రగుత్తి గంగరాజు మాట్లాడుతూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఏంపీఈఓలను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి

కడప రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో పదేళ్లగా పనిచేస్తున్న ఏంపీఈఓలను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించి పనికి సమాన వేతనం ఇవ్వాలని అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రెడ్డిప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సమావేశం జిల్లా అధ్యక్షుడు సూర్య నారాయణ యాదవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీఈఓఎస్‌లు అటు రైత లకు, ఇటు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం రైతులకు చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. మట్టి నమూనా నుంచి విత్తనం విత్తి పంట విక్రయం వరకు రైతులతో కలిసి పంట అధిక దిగుబడుల సాధనకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ప్రతి గ్రామానికి 1500 ఎకరాల నుంచి 2500 ఎకరాల వరకు గ్రామ స్థాయిలో రైతులకు అండగా ఉండాలని 2015లో రాష్ట్ర వ్యాప్తంగా 1386 మంది డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ(డీఎస్‌సీ) ద్వారా మెరిట్‌ను బట్టి ఏంపీఈఓలను ఏర్పాటు చేశారన్నారు. పదేళ్లగా రెగ్యులర్ చేయకుండా చాలీచాలని జీతాలు ఇస్తున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు జి. రవీంద్ర, జనరల్ సెక్రటరీ టి. వికాస్‌కుమార్‌రెడ్డి జాయింట్ సెక్రటరీ బాబు, నేతలు శ్రీవాణి, గిరిబాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం మూన్నాళ్ల ముచ్చటేనా?

పులివెందుల టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపల్ అధికారులు నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై కొరడా ఝుళిపించడం లేదు. కళ్లముందే కవర్లతో వెళుతున్నా ఉదాశీనత చూపడం పలువురిని విస్మయానికి గురి చేస్తోంది. పులివెందుల పట్టణాన్ని ప్లాస్టిక్ భూతం కబళించనుంది. పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని దేశంలో సంపూర్ణంగా నిషేధించి స్వచ్ఛభారత్‌ను తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం ముందుకు సాగడం లేదు. అధికారుల అలసత్వం, ప్రజల అవగాహన లోపం వెరసి ప్లాస్టిక్ నిషేధిత ప్రక్రియ మొక్కుబడిగా సాగుతోంది. క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాల్సిన అధికారులే రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక మార్కెట్‌లో కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, ఇతర నిత్యావసరాలను విరివిగా కొనుగోలు చేస్తుంటారు. వీటిని ప్యాక్ చేసి తీసుకెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉండేలా పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్నారు. అయితే ప్రభుత్వం తొలుత 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడకూడదని జీవో జారీ చేసింది. తిరిగి 120 మైక్రాన్లకు దాన్ని పరిమితి పెంచింది. నిషేధిత ఉత్పత్తులను వినియోగించకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికార యంత్రాంగం ప్రతిరోజూ నిత్యావసర దుకాణాలకు కూరగాయలు, ఇతర వ్యాపారుల వద్దకు హోటళ్ల నిర్వాహకులు, మాంసం

ప్రజలకు అవగాహన అవసరం



ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన అవసరం. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. అలాగే దాడులు నిర్వహించాం. అయితే ప్రజల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. దీంతో ప్లాస్టిక్ నిషేధంపై అడుగులు ముందుకు వేయలేకపోతున్నాం. ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదు. సమాచారం అందిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

- రాముడు, మున్సిపల్ కమిషనర్, పులివెందుల

- ప్లాస్టిక్ మహమ్మారిపై కొరడా ఏదీ?
- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- నామమాత్రపు తనిఖీలతో సరిపెట్టుకుంటున్న అధికారులు
- బడా వ్యాపారుల జోలికి వెళ్లని వైనం



పాలిథిన్ కవర్లలో జామ పండ్లను విక్రయిస్తున్న దృశ్యం

విక్రయదారులు తదితరాలు అమ్మే వారి వద్దకు వెళ్లి ప్లాస్టిక్ పెనుభూతంపై ప్రజలకు వివరించి వాటి వినియోగం నిలిపివేద్దామని ప్రతిజ్ఞ చేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అయితే కొంతకాలంగా మున్సిల్ అధికారులు ప్లాస్టిక్ వినియోగంపై పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. అందుకే రోజురోజుకూ నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరిగిపోతోందని పేర్కొంటున్నారు. నిత్యం పులివెందులకు వచ్చే వేలాది మంది ఏదో ఒక అవసరంతో కొనుగోలు చేసిన వాటిని తరలించేందుకు ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారు. ఫంక్షన్లలో మంచినీరు, జ్యూస్‌స్టాళ్లలో చెరుకురసం, టీ, కాఫీ వంటివాటికి ప్లాస్టిక్ గ్లాసులు వినియోగిస్తున్నారు. మద్యంషాపుల వద్ద కూడా డిస్పోజబుల్ ప్లాస్టిక్ గ్లాసులు వినియోగిస్తున్నారు. కర్రీస్ పాయింట్లలో కూడా వేడి వేడి కూరలు కవర్లలో నింపి పార్శిల్ ఇస్తున్నారు. వినియోగదారులు వాడుకున్న తరువాత ఆ వ్యర్థాలు కాల్వల్లో, వీధు ల్లో చెత్తకుప్పల్లో పడేయడంతో నీటిపారుదలకు ఆటంకం కలిగిస్తోంది. కొన్నిచోట్ల ప్లాస్టిక్ కవర్లు వీధుల్లో సంచరించే ఆవులు తినడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నాయి. అంతేకాకుండా పట్టణంలోని శ్రీనివాస హాలు సమీపంలో ఉన్న కాల్వను పరిశీలిస్తే నిషేధత ప్లాస్టిక్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులతో నిండి ఉంటుంది. అంతేకాకుండా డంపింగ్ యార్డుల్లో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి ఆందోళన కలిగిస్తోంది. మున్సిపాలిటీలో ఇప్పటికీ విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ఇతర విక్రయాలు జరిగినా ఎటువంటి చర్య లూ లేవు. ఇటీవల ఒక కిరాణా షాపుపై మా త్రమే మున్సిపల్ అధికారులు దాడులు చేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప ట్టణంలో ఇంకా అనేక మంది బడా వ్యాపారు లు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు భారీ మొత్తంలో విక్రయిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్లాస్టిక్ నిషేధం ఆర్భాటంగా ప్రారంభించిన అధికారులు కొద్దిరోజులకే ఈ అంశాన్ని గా లికి వదిలేయడం చర్చనీయాంశంగా మా రింది. ఇప్పటికైనా అధికారులు నిషేధిత ప్లాస్టి క్ ఉత్పత్తులను నియంత్రించి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేలా ముందుకు రావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

విస్తృత ప్రచారమే కీలకం

ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడమే కీలకం. బట్టసంచులు వాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. అదేవిధంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించాలి. ప్లాస్టిక్ కవర్లు తెచ్చే ఆహార పదార్థాలు విషతుల్యం అయ్యే అవకాశం ఉంది. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ వా డకాన్ని పూర్తిగా నిషేధించాలి. అదేవిధంగా ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, వినియోగాన్ని తగ్గిం చి వాటిస్థానంలో ప్రత్యామ్నాయం చూపాలి.

కడప మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా బాలస్వామిరెడ్డి

కడప క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా ఇ.బాలస్వామిరెడ్డిని నియమిస్తూ డీజీపీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలస్వామిరెడ్డి కడప ట్రాఫిక్ డీఎస్పీగా, సీసీఎస్ డీఎస్పీగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన కర్నూలులో స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న రమాకాంత్‌ను ఈగల్‌కు బదిలీ చేశారు.

ఇకపై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదు: ఏఈ

చెన్నూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇకపై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదని ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. రూ.40లక్షల ఖర్చుతో చెన్నూరు, వల్లూరు మండలాల మధ్య ఉన్న విద్యుత్ లైన్లను వేరు చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు చిన్నమాచుపల్లె వద్ద వ్యవసాయ పొలాల్లో 33 కేవీ విద్యుత్ లైన్లను వేరు చేశామన్నారు. ఇదివరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం, కడప నగరం నుంచి 220 కేవీ ద్వారా విద్యుత్‌లైన్లు రెండు మండలాలకు రావడంతో ఎక్కడ ట్రిప్ అయినా రెండు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేదని, ఇప్పుడు ఆ సమస్య ఉండదన్నారు.

సీతాలమ్మ గుడికి రంగులు

కమలాపురం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలో గల గిడ్డంగివీధిలో వెలసిన సీతాలమ్మ తల్లి దేవాలయానికి దాతల సహకారంతో రంగులు వేశారు. భూమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి రూ.18 వేలు అందజేయడంతో రంగులు వేయించి సుందరీకరించారు.

పంచాయతీరాజ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలి

కడప మారుతీనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):ఆశాజనకంగా లేని పంచాయతీరాజ్ వ్యవస్థను తిరిగి పూర్వవైభవం తీసుకువచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని తులసిరెడ్డి కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సామాజిక సంస్థ కడప వారి ఆధ్వర్యంలో నేటి సంక్షోభ పరిస్థితులు-పరిష్కారాలు అనే అంశంపై సోమల రాజు ఫౌండేషన్ (బెంగుళూరు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్) సారథ్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాటాడుతూ దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ చాలా గొప్పదని, గత కొన్ని శతాబ్దాల క్రితం నుంచి వున్న ఏకైక వ్యవస్థ అన్నారు. అలాంటి వ్యవస్థ ప్రస్తుతం ఆశాజనకంగా లేకపోవడం బాధాకరమన్నారు.

నువ్వుల పంట పరిశీలన



రావులకొలనులో ఎదుగుదల లేని నువ్వుల పంటను పరిశీలిస్తున్న ఏఓ శివమోహన్‌రెడ్డి

సింహాద్రిపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులకొలను గ్రామంలో దెబ్బతిన్న నువ్వుల పంటను మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి పరిశీలించారు. రైతు మహేశ్వర్‌రెడ్డి కలుపు నివారణకు పులివెందులలోని ఓ ఫర్టిలైజర్ షాపులో మందులు తెచ్చి నువ్వుల పంట విత్తిన రోజు సాయంకాలం భూమిపై పిచికారీ చేసినట్లు తెలిపారు. షాపు యజమాని నాసిరకం మందులు ఇవ్వడంతో వాటిని పిచికారీ చేయడంతో నువ్వుల పంట ఎదుగుదల లేకుండా ఆగిపోయింది. పులివెందుల షాపు యజమాని స్పందించక పోవడంతో ఆ రైతు మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశాడు. దీంతో వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి ఆదివారం పంటను పరిశీలించారు. అనంతరం ఈ సమస్యను జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి డీలర్‌పై చర్యలు తీసుకునేటట్లు చూస్తానని రైతుకు హామీ ఇచ్చారు. సుమారు 13 ఎకరాల్లో పంట నష్టపోయిన నాకు న్యాయం జరిగేలా చూడాలని రైతు మహేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు.

అలరించిన నృత్యాలు



శిల్పారామంలో నృత్యం చేస్తున్న యువతీ యువకులు

కడప కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలోని శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై సంబంధిత అధికారి పి. శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో ఆదివారం కడప నగరానికి చెందిన వర్షిని డ్యాన్స్ అకాడమీ బృందం యువతీ, యువకులు వివిధ జానపద గీతాలు, శాస్త్రీయ, సినీ గీతాలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.

పులివెందుల రూరల్: పులివెందుల శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో కడప కిషోర్ డ్యాన్స్ అకాడమీ బృందంచే నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. వస్తావ జానకి, రాధికా రాధికార.. ఆయుధపూజ తదితర పాటలకు స్టెప్పులేయగా సందర్శకులు ఈలలు, కేకలతో ప్రోత్సహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సందర్శకులకు ఏఓ సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

తెగుళ్లతో రబీ రైతుకు నష్టం: ఆర్సీపీ



ఉప్పరపల్లె వద్ద వరిని పరిశీలిస్తున్న ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

చెన్నూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు రబీలో సాగు చేసిన వరి తెగుళ్ల బారిన పడి నాశిరకం క్రిమిసంహారమందులు పని చేయక నష్టపోతున్నారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపవరం, శివాలపల్లె, ఉప్పరపల్లె, చిన్నమాచుపల్లె వద్ద రబీలో సాగుచేస్తున్న వరి పంటను ఆదివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రైతు నాయకులు ప్రతాప్‌రెడ్డి, మునిరెడ్డి, సీకేదిన్నెమండల కార్యదర్శి పడగలం ప్రసాద్, ఆర్సీపీ నాయకులు రమేశ్‌ప్రభు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు: రైతులను ప్రభుత్వాలు పట్టించుకోకపోతే వారు ఆకలిచావులను చవి చూడాల్సి వస్తుందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పంట పొలాల సందర్శనలో భాగంగా వల్లూరు మండలంలోని పుష్పగిరి, ఆదినిమ్మాయపల్లె, గాలివారిపల్లె, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని పొలాలను ఆయన తన ప్రతినిధి బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రైతుల ఆవేదనను కలెక్టరు దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక జీవితంలోనే ఆనందం



మాట్లాడుతున్న రాకేష్‌చంద్ర

కడప కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక జీవితంలోనే నిజమైన ఆనందం కలదని నగర కార్పొరేషన్ అడిషినల్ కమిషనర్ రాకేష్ చంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 48వ డివిజన్ కృపా కాలనీలో నూతనంగా ప్రతిష్ఠించిన న్యూ నేటివ్ కృపా చర్చిలో పాస్టర్ పి. మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో మొదటి ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగజంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ధూపం రాజు, విశ్వాసులు పి.రవితేజ, జాన్, శాంతిరాజు, రోజా, అజయ్, ఆనంద్, నరసయ్య, కృప తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాలలో రాణించాలి



ప్రథమ విజేతకు బహుమతిని అందిస్తున్న నాయకులు

కడప కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాలలో బధిర మహిళలు రాణించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, టీడీపీ ఎన్ఆర్ఐ కువైత్ విభాగ ఉపాధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా పేర్కొన్నారు. సంక్రాంతి వేడుకలలో భాగంగా ఏపీ కడప అసోసియేషన్ ఫర్ డెఫ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో ఐఈఆర్‌టీ యశోధ సారథ్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి హాజరైన బధిర మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ విజేతగా వై.రేణుక (కడ ప), ద్వితీయ విజేతగా బుజ్జి (బోడెద్దులపల్లి), తృతీయ విజేతగా ఎన్.రెడ్డిప్రసన్న (కడప) నిలిచారు. వీరితో పాటు చెస్ బాల్ క్రీడలో శ్రావణి, బుజ్జి, అలాగే మైండ్ విన్ క్రీడలో శ్యామల, గౌరీ, మైండ్ గేమ్ పిల్లల విభాగంలో శివ, నిషిత, సమీర విజేతలుగా నిలిచారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఇర్ఫాన్, ఆవుల వెంకటేష్, బధిరుల సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మీకిశోర్ పాల్గొన్నారు. విజేలకు బహుమతులను అందజేశారు.

వేమన పద్యం సమాజ దిక్సూచి: వీసీ





వేమన విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి... వేమన జయంతి వేడుకలో పాల్గొన్న నాయకులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పేద, ధనిక అసమానతలు, కులమత భేదాలు, మూఢవిశ్వాసాలను తూర్పారబట్టిన వేమన పద్యాలు సమాజ దిక్సూచిలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వేమన జయంతి సందర్భంగా ఆదివారం యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ వేమన విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నేటికీ ప్రజల మధ్య సంభాషణల్లో సామెతలు, జాతీయాల రూపంలో వేమన పద్యాలను గుర్తు చేసుకుంటూనే ఉన్నామన్నారు. తేలికైన పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా అందించిన ప్రజాకవి వేమన అని ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. వేమనను సీపీబ్రౌన్ వెలుగులోకి తీసుకురావడమే కాక ఆ పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి వేమనను విశ్వకవిని చేశాడన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేమన విశ్వ కవి: తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వేమన గొప్ప సంఘ సంస్కర్త అని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేమన జయంతిని వేంపల్లెలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ వేమన విశ్వకవి అన్నారు. ఆయన పద్యాలు సార్వజనీనం, సార్వకాలీనం, సార్వప్రాంతీయం అని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్, రాజు, ఐచర్ రమణ, ఉత్తన్న, వినయ్ తదితరులుపాల్గొన్నారు.

పులివెందులలో...

ప్రజాకవి యోగివేమన జయంతిని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంటు సొసైటీ (ఆర్సీడీఎస్) ఆధ్వర్యంలో లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్టు వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, సొసైటీ ప్రతినిధులు యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. ఆర్సీడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట సర్వోత్తమ్‌రెడ్డి, సొసైటీ రాష్ట్ర కార్యదర్శులు ఎద్దుల అర్జున్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, లీలావతి, వృద్ధాశ్రమం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక సామాజిక ఉద్యమకారుడు వేమన

కడప సెవెన్ రోడ్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సామాజిక ఉద్యమకారుడు వేమన అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్‌రెడ్డి తెలిపారు. వేమన జయంతిని పురస్కరించుకొని ఆదివారం రాజీవ్‌మార్గ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సమాజాన్ని మేల్కొలిపిన వేమన

కడప కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తన సాహిత్యంతో వేమన సమాజాన్ని మేల్కొలిపాడని కడప రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కె. పద్మనాభరెడ్డి కొనియాడారు. వేమన జయంతిని పురస్కరించుకుని కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాజీవ్ మార్గ్‌లో గల వేమన విగ్రహానికి సమితి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి సమాజంలో వేమన స్పృశించని అంశం అంటూ లేదన్నారు. ప్రతి రంగాన్ని ఆయన పరిశీలించి సులభమైన పద్యాల ద్వారా ప్రజలకు బోధ చేశారన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి మా ట్లాడుతూ వేమన సామాన్యులకు సైతం అర్థమయ్యేరీతిలో ఆటవెలది పద్యాలతో సత్యాలను విప్పి చెప్పారన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక అపూర్వం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సికెదిన్నె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో ఆనందంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీనదయాల్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లి వెంకటేశ్వర ఉన్నత పాఠశాల 2009 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారి ఉపాధ్యాయులు రమణారెడ్డి, కమలమ్మ, అరుణ, లలితమ్మ, క్రిష్ణారెడ్డి, రాజు, శ్రీదేవి, పల్లా అరుణ, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు చదువుకునే సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థులతో ఎలా ఉండేవారో చర్చించుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడిపారు.

'ఏపీజీబీ తరలింపు లేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలి'

కడప సెవెన్ రోడ్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీజీబీ తరలింపు లేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ ఎ.రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మాటల్లో స్పష్టత లోపించిందని, ప్రభుత్వం విధానపరమైన అధికారిక ప్రకటన చేస్తేనే ఏపీజీబీ ప్రధాన కార్యాలయం అమరావతి తరలిపోతుందన్న భరోసా కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు లేదని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

అమిత్‌షా పర్యటనపై వామపక్షాల నిరసన



అంబేడ్కర్ సర్కిల్లో నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆంధ్రాలో పర్యటించనుండటపై ఆదివారం వామపక్షాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబురావు, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సీపీఐ నాయకులు రమణయ్య, వామపక్ష ప్రజాసంఘాల నాయకులు సుబ్బారెడ్డి, వేణుగోపాల్, మనోహర్, అన్వేష్, బాదుల్లా, మద్దిలేటి, దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

చాపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ఈనెల 20న సోమవారం నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చాపాడు పశువైద్య అధికారి మహమ్మద్‌గౌస్ తెలిపారు. ఈ శిబిరాల్లో గేదెలు, ఆవులకు శస్త్ర చికిత్సలు, ఎదకు వచ్చే విధంగా గర్భకోశ వ్యాధులకు తదితర రోగాలకు మందులు ఇస్తున్నట్లు చెప్పారు. నట్టల నివారణ, గాలికుంటు వ్యాధికి టీకాలు ఇస్తున్నామన్నారు. 20న భద్రిపల్లె, 21న చిన్నగురవలూరు, 22న చెంచుపల్లె, 23న గాంధీనగర్, 24న ఓబుళరెడ్డిపేట, 25న ఖాదర్‌పల్లె, 27న మొరాయిపల్లె, 28న నరహరిపురం, 29న ద్వారకానగరం, 30న వెదురూరు, 31న అన్నవరం గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేమన సాహిత్యాన్ని భావితరాలకు అందజేయాలి



మాట్లాడుతున్న నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వేమన సాహిత్యాన్ని భావితరాలకు అందజేయాలని వేమన సేవా సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేమన జయంతిని పురస్కరించుకుని వేమన సేవాసమితి ఆధ్వర్యంలో గాంధీరోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద నుంచి శివాలయం వీధిలోని వేమన విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి వేమన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. శివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పద్యపఠనం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెమెంటో, వేమన శతకం పుస్తకాలను అందించారు.

ఈ కార్యక్రమంలో ఎంఈవో సావిత్రమ్మ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువులబాబు, వేమన సేవా సమితి అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, శివాలయం ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, స్పందన సేవా సంస్థ అధ్యక్షులు రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌కొండయ్య, సాయికుమార్, నాగరాజాచారి, పల్లా క్రిష్ణ, రమణయ్య, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ల ఐక్యత కోసం కలిసి రావాలి


పెద్దకోమటి వేమారెడ్డి వేషధారణలో పుల్లారెడ్డి

ముద్దనూరు జనవరి19(ఆంధ్రజ్యోతి):రెడ్ల ఐక్యత కోసం రెడ్డి కులస్థులంతా కలిసి ముందుకు రావాలని రెడ్ల ఐక్యత వేదిక నిర్వాహకుడు, విశ్రాంత అధ్యాపకులు బూచుపల్లి పుల్లారెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక సువిధా స్కూల్ ప్రాంగణంలో ఆదివారం పుల్లారెడ్డి ఆధ్వర్యంలో రెడ్ల ఐక్యత వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రెడ్ల కులస్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ రెడ్డి కులస్థులకు ఘన చరిత్ర ఉందని కాశిరెడ్డి నాయన, పెద్దకోమటిరెడ్డి, కడప కోటిరెడ్డి,ఉయ్యాలవాడ నరసింహారెడ్డి,బుడ్డా వెంగల్‌రెడ్డి, గోన గన్నారెడ్డి, యోగి వేమన వంటి మహనీయులు ఎంతో మంది రెడ్డి కులస్థులు ఉన్నారన్నారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సాయి హారతుల ఉత్సవం

బద్వేలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి)ః పట్టణంలోని రాచపూడి నాగభూషణం కల్యాణ మండపంలో సోమవారం సాయి టి.వి. ఆధ్వర్యంలో సాయి హారతుల ఉత్సవం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాచపూడి సాయిక్రిష్ణ పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో సాయిబాబాకు తొలి హారతి ఇచ్చిన రోజును పురస్కరించుకుని ఈకార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి భక్తులందరూ హాజరు కావాలని కోరారు. అలాగే 6.30 గంటలకు హారతులు, 7.15 గంటలకు ప్రమోద్ భీష్మకు సన్మానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440261908, 9391915408 నంబర్లను సంప్రదించాలన్నారు.

శనగ రైతు కుదేలు..!

మైలవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అసలే తెగుళ్లతో అప్రమత్తమవుతున్న శనగ రైతులను గతంలో కురిసిన అకాల వర్షం తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. దీంతో శనగ పంటపై బూజు, ఎండు తెగులు సోకడంతో వందల ఎకరాల్లో పంట దెబ్బతింది. మండలంలో కల్లుట్ల, తలమంచిపట్నం, వద్దిరాల, బెస్తవేముల, చిన్నకొమెర్ల, నవాబుపేట, తదితర పంచాయతీల్లో మూడు వేల ఎకరాలకుపైగా శనగ పంట సాగు చేశారు. వీటిలో ఎక్కువగా పంట ఎండిపోవడమే కాకుండా మొక్కలు కూడా పడిపోవడంతో పంట పూర్తిగా నష్టపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు. గత ఏడాది ఎకరాకు 4 నుంచి 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది ప్రస్తుతం వర్షం దెబ్బతో ఎకరాకు రెండు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **పూత దశలోనే వర్షం దెబ్బ..:** శనగ పంట ఎదుగుదలకు ఎండ ఎక్కువగా ఉండాలి. అయితే ప్రతి రోజు ఆకాశం మబ్బులతో నిండి ఉండడంతో పంటలో తెగుళ్ల ఉధృతి పెరిగింది. నీటి శాతం ఎక్కువ కావడంతో పంట అక్కడక్కడ కుళ్లిపోయింది. పంట పూత దశలో ఉండి బుడ్డలు వచ్చే సమయంలో అకాల వర్షం పడడంతో పూత రాలిపోయిందని రైతులు వాపోతున్నారు. పంటపై చేసిన పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకు ఎకరాకు రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతుందని మందుల పిచికారీ, రసాయనిక మందులు, సేద్యాలు, కలుపు కూలీలు, పంట నూర్పిడి, తదితర ఖర్చులుఉండడంతో పంట దిగుబడి అంతంత మాత్రంగానే ఉండడంతో పెట్టిన పెట్టుబడులైన వచ్చేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.


కల్లుట్లలో తెగులు సోకడంతో ఎండిపోయిన శనగ పంట

● రైతులను ఆదుకోవాలి



శనగ పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉందని, తెగుళ్లు రాకుండా రైతులు క్రిమి సంహారక మందులు పిచికారీ చేశారు. వర్షం దెబ్బతో పంట నాశనమైంది. ఎండలు లేక పంట తెగుళ్ల బారిన పడి రైతులు నష్టపోతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వం శనగ రైతులను ఆదుకోవాలి.

● ప్రభుదాసు, రైతు

● ఈ ఏడాది దిగుబడి చాలా తక్కువ



రెండు సంవత్సరాల క్రితం సాగు చేసినప్పుడు శనగ పంట ఎకరాకు ఆరు నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చేవి. గత ఏడాది వర్షం లేకపోవడంతో పంట సాగు చేయలేదు. ఈ ఏడాది పూత దశలో వర్షం పడడం, వాతావరణ మార్పులతో పంట పూర్తిగా దెబ్బతింది. ఎకరాకు రెండు క్వింటాళ్లు కూడా అయ్యే పరిస్థితి కనిపించడంలేదు.

● నాగేశ్వరరెడ్డి, రైతు

రక్షణ లేదు.. ప్రహరీ అసలే లేదు...


అలుగువంక మీద పాడైన రక్షణ గోడ

దువ్వూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలో ఘోరీస్వామి దర్గా వద్ద ఉన్న అలుగు వంక వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. నాలుగులైన్ల జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు వాహనాల రాకపోకలకు ఇక్కడ బ్రిటిష్ కాలంలో తారు రోడ్డు వేశారు. ఈ దారి వెంట నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఈ బ్రిడ్జీ మీదుగా ఘోరీస్వామి దర్గా, రాంసాయినగర్, మూడిండ్లపల్లె, బాలాయపల్లె, మదిరేపల్లె, నీలాపురం, చిన్నపల్లె గ్రామాలకు ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, బస్సులు నిత్యం తిరుగుతుంటాయి.

రాత్రి వేళ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో చిన్న చిన్న ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. గడిచిన అయిదారేళ్లుగా అలుగువంకకు నిర్మించినా ప్రహరీలు ఇరువైపులా పాడై పూర్తిగా లేకున్నా సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇరువైపులా ప్రహరీగోడలు లేకపోవడంతో పిచ్చిమొక్కలు మొలచి వాహనచోదకులకు అసలు బ్రిడ్జీకి ప్రహరీగోడ ఉందా లేదా అనే విషయం అర్థంకాని దుస్థితి నెలకొంది. పెద్ద ప్రమాదాలు జరుగకముందే సంబంధిత అధికారులు అలుగు వంక (మినీ ఆనకట్ట) బ్రిడ్జీకి ఇరువైపులా గోడలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


రహదారి బ్రిడ్జీకి కనిపించని ప్రహరీ ఆనవాళ్లు

ఆహార నియమాలు పాటిస్తే గుండెజబ్బును నివారించవచ్చు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పాత కోట శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు , జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆహార నియమాలు పాటించడంతో పాటు నిత్యం వ్యాయామం చేయడం ద్వారా గుండె జబ్బునుండి ప్రాణాలు కాపాడుకోవచ్చని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పాత కోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక నెహ్రూరోడ్డులోని లక్ష్య కార్డియాక్ సెంటర్‌లో 45 వ ఉచిత కంటి గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రతి నెలా మూడో ఆదివారం ఉచిత శిబిరంను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గుండెజబ్బులకు సంబంధించి 53మంది రోగులను ఉచితంగా పరీక్షించారు. వీరిలో 24 మందికి ఉచితంగా ఈసీజీ పరీక్ష, 9మందికి గుండెస్కానింగ్ పరీక్ష చేసి చికిత్సకు తగుసూచనలు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ హరిత ఆధ్వర్యంలో 32 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి వారికి తగు చికిత్స చేసి సూచనలు అందజేసి మందులు పంపిణీ చేశారు.

ఘనంగా బ్రాహ్మణ సేవా సంఘం వార్షికోత్సవం


రామక్రిష్ణశాస్త్రిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వసంతపేటలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కంబగిరిరావు సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. నారాయణ అన్నప్రసాదం నిరంతరాయంగా కొనసాగించడానికి ఆర్థికసహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా తాళ్లమాపురం కొరటమద్ది వెంకటసుబ్బావదానులు సంస్మరణ సభ నిర్వహించారు. తిరుపతికి చెందిన వేద పండితులు బ్రహ్మశ్రీ గురిగెళ్ల రామక్రిష్ణశాస్త్రిని శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీబీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, సంఘ మహిళా అధ్యక్షురాలు విశాలాక్షి, ఉపాధ్యాయుడు గంగరాజు, బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజం కోసం కృషి చేద్దాం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి రహిత సమాజంకోసం కృషి చేద్దామని వైఎంఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.హిమబిందు పేర్కొన్నారు. ఆదివారంకుష్ఠువ్యాధిపై ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. అనంతరం కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించారు.

'లోకేశ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి కేటాయించాలి'

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఉపముఖ్యమంత్రి పదవిని కేటాయించాలని తెలుగుదేశం పార్టీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం బీసీసెల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నారా లోకేష్ సేవలను గుర్తించి ఉపముఖ్యమంత్రి పదవిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలుగు వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోమేదికం సుదర్శన్, బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఎస్ సుబ్బరాజు, ఎస్సీసెల్ నాయకుడు బాలయ్య పాల్గొన్నారు.

బీసీ భవనం నిర్మించాలి

బద్వేలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి)ః బద్వేలు పట్టణంలో బీసీ భవనం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు పట్టణంలో నియోజకవర్గ బీసీ సంక్షేమ, సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీలు సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నా ఎలాంటి భవనం లేదని బీసీ భవన నిర్మాణం చేపడితే బాగుంటుందన్నారు. ఇందుకు అనువుగా ఒక ఎకరా స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు. రిటైర్డ్ డీఎస్పీ వెంకటయ్య, బీసీ సంఘం నాయకులు బీవీ.రాజు,బి.సి.మహిళాఅధ్యక్షురాలు సుభాన్, సుబ్బరాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

సీపీఐ, ఏఐటీయూసీ నాయకుల అరెస్టు

కొండాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన నేపథ్యంలో ఆదివారం సీపీఐ, ఏఐటీయూసీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యల నేపథ్యంలో రాష్ట్రంలో అమిత్‌షా పర్యటనను అడ్డుకుంటామని వామపక్షాలు పిలుపునిచ్చాయి. ముందస్తు జాగ్రత్తగా సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్‌బాబు, వెంకటరమణ, సుబ్బారావు, జయంతును ఉదయం అరెస్టు చేసి సాయింత్రం విడుదల చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం

కె.వినయ్‌కుమార్,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి



బద్వేలు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోకి వచ్చే గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఆశాల ద్వారా ప్రతి రోజూ ఇంటింటి సర్వే, లార్వా అభివృద్ధి చెందకుండా నిర్వీర్యం చేస్తూ జబ్బుల భారినపడకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ పీహెచ్‌సీకి వచ్చినవారికైనా, గ్రామాల వద్ద ఉన్నవారికైనా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తమతోపాటి తమ సిబ్బంది కూడా 24 గంటలూ అందుబాటులో ఉంటామంటున్న తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.వినయ్‌కుమార్‌తో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ...

సూటిగా

ప్రశ్న : తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంత మంది వైద్య సిబ్బంది ఉన్నారు.

జవాబు : 12 మంది ఏఎన్ఎంలు, 9మంది సీహెచ్‌ఓలు, ఆరోగ్యకేంద్రం సిబ్బంది 12 మంది, సూపర్‌వైజర్లు ముగ్గురు మొత్తం 36 మంది ఉన్నాము.

ప్రశ్న : పీహెచ్‌సీ పరిధిలోకి ఎన్ని గ్రామాలు వస్తాయి ?

జవాబు : 9సచివాలయాల పరిధిలో 35 గ్రామాలు, 22,557 మంది జనాభా పీహెచ్‌సీ పరిధిలోకి వస్తారు.

ప్రశ్న : గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి వైద్యసేవలు అందిస్తున్నారు ?

జవాబు : గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలు, డయేరియా వంటి వ్యాధులపై ఆశాల ద్వారా ప్రతి రోజూ ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం. జ్వరాలు ఇతర జబ్బులున్నవారిని గుర్తించి ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో అప్‌లోడ్‌చేసి ప్రాథమికంగా ఇంటి వద్దే వైద్యపరీక్షలు నిర్వహించి మందులను సరఫరా చేస్తాం. నయంకాని పక్షంలో పీహెచ్‌సీకి సిఫారస్సుచేసి నయమయ్యే వరకు మెరుగైన వైద్యం అందిస్తాం.

ప్రశ్న : 104 వాహనం ద్వారా గ్రామాల్లో వైద్య సేవలను వివరించండి ?

జవాబు : 26 రోజులపాటు 20 గ్రామాలను ఎంపికచేసి 104వాహనం ద్వారా ఆయా గ్రామాలకు వెళతాం. బీపీ, షుగర్, ఇతర జబ్బులపై వైద్యపరీక్షలు నిర్వహించి అక్కడే మందులను పంపిణీచేస్తాం. వెళ్లిన గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉంటే, పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపట్ల వారికి అవగాహన కల్పిస్తాం. అవసరమైన వారికి మందులను కూడా పంపిణీ చేస్తాం.

ప్రశ్న : ప్రభుత్వాసుపత్రిలో కాన్పులకు గర్భిణీలు వస్తున్నారా ?

జవాబు : తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ పరిధిలో నెలకు ముగ్గురు నుంచి 5 గురు వరకు కాన్పులకోసం వస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా కాన్పుచేయడమే గాకుండా తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటుందని, జననీ సురక్ష యోజన పథకం ద్వారా అర్బన్‌పరిధిలో వారికి రూ. 600, రూరల్ పరిధిలోవారికైతే రూ.1000 తల్లి బ్యాంకు అకౌంట్‌లో జమచేయడం జరుగుతుంది. శిశుసురక్ష పథకం కింద కాన్పుఅయిన వారికి భోజనం, ఉచితంగా పరీక్షలు, మందులు పంపిణీచేయడమేగాకుండా, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 వాహనం ద్వారా ఇంటి వద్దకు సురక్షితంగా చేరుస్తున్నాం.

కడప మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా బాలస్వామిరెడ్డి

కడప క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా ఇ.బాలస్వామిరెడ్డిని నియమిస్తూ డీజీపీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలస్వామిరెడ్డి కడప ట్రాఫిక్ డీఎస్పీగా, సీసీఎస్ డీఎస్పీగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన కర్నూలులో స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న రమాకాంత్‌ను ఈగల్‌కు బదిలీ చేశారు.

ఆధ్యాత్మిక జీవితంలోనే ఆనందం

కడప కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక జీవితంలోనే నిజమైన ఆనందం కలదని నగర కార్పొరేషన్ అడిషినల్ కమిషనర్ రాకేష్ చంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 48వ డివిజన్ కృపా కాలనీలో నూతనంగా ప్రతిష్ఠించిన న్యూ నేటివ్ కృపా చర్చిలో పాస్టర్ పి. మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో మొదటి ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.